ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం ఉష్ణోగ్రత ఖమ్మం: గరిష్ఠం 29 । కనిష్ఠం 18 | భద్రాద్రి: గరిష్ఠం 27 । కనిష్ఠం 17 ◆ సోమవారం, 8 జనవరి 2024


మొదటి బహుమతి సాధించిన ముగ్గు, విజేత రమాదేవి

ముగ్గులు.. ముచ్చటగొలిపె..


ముగ్గులు వేస్తున్న మహిళలు

- ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ
- హాజరైన 'ఆంధ్రజ్యోతి' ప్రచురణకర్త కోగంటి వెంకట శేషగిరిరావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న 'ఆంధ్రజ్యోతి' ప్రచురణకర్త కోగంటి వెంకట శేషగిరిరావు, చిత్రంలో బీలీఫ్ ఆసుపత్రి నిర్వాహకురాలు రమాజ్యోతి, 'ఆంధ్రజ్యోతి' పలు విభాగాల ఇన్‌చార్జ్‌లు

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 7 : సంక్రాంతి పండుగ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన' ముత్యాలముగ్గుల పోటీలు ఆదివారం ఖమ్మంలో ఉత్సాహంగా జరిగాయి. జిల్లాస్థాయిలో ఖమ్మం శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అండ్ కనస్ట్రక్షన్స్ సంస్థ సహకారం అందించగా నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రం ఆవరణలో పోటీ జరిగింది. ఈ పోటీలకు మహిళలు అధికసంఖ్యలో హాజరై రంగవల్లులను తీర్చిదిద్దారు. తెలుగు సంప్రదాయంతో పాటు సంక్రాంతి పండుగ ప్రాశస్త్యాన్ని తెలిపేలా తమ ముగ్గులను పరిచారు. ఈ కార్యక్రమానికి 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ప్రచురణకర్త కోగంటి వెంకట శేషగిరిరావు, ఖమ్మంలోని బీలీఫ్ ఆసుపత్రి నిర్వాహకురాలు మోడెంపూడి రమాజ్యోతి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోగంటి వెంకట శేషగిరిరావు మాట్లాడుతూ మహిళలు అద్భుతంగా వేసిన రంగవల్లికలను చూస్తుంటే సంక్రాంతి పండుగ ముందుగానే వచ్చిన అనుభూతి కలుగుతోందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంలో ఆంధ్రజ్యోతి సంస్థలు ఎప్పుడూ ముందుంటాయన్నారు. మోడెంపూడి రమాజ్యోతి మాట్లాడుతూ నిష్పాక్షికంగా వార్తలు, కథనాలను రాయడమే కాకుండా సంప్రదాయాలను కాపాడేలా.. మహిళల్లోని సృజనాత్మకతను వెలికి తీసే, ముగ్గులపోటీని నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఆంధ్రజ్యోతి ఖమ్మం బ్యూరో ఇన్‌చార్జ్ నలజాల వెంకటరావు మాట్లాడుతూ సంప్రదాయాలను గౌరవిస్తూ ఏటా సంక్రాంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి ఏబీఎన్ ముగ్గుల పోటీ నిర్వహిస్తోందన్నారు.

కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' ఎడిషన్ ఇన్‌చార్జ్ కొల్లు రాజేష్, సర్క్యులేషన్ మేనేజర్ మొగలపు వెంకట సూర్యనారాయణ, ఏడీవీటీ మేనేజర్ మానాప్రగడ రమేష్, ఖమ్మం, కొత్తగూడెం స్టాఫ్ రిపోర్టర్లు తాళ్లూరి రమేష్, దుద్దుకూరి రామారావు, ఏబీఎన్ స్టాఫర్ నెల్లూరి శ్రీధర్, ప్రొడక్షన్ ఇన్‌చార్జ్ కర్నాటి సురేష్‌తో పాటు ఎడిటోరియల్ సిబ్బంది, జిల్లా రిపోర్టర్లు, తదితరులు పాల్గొన్నారు. ఈ ముగ్గుల పోటీకి అభినవ్ కాన్సెప్ట్ స్కూల్ నిర్వాహకురాలు పారుపల్లి అరుణ, యోగా ఉపాధ్యాయురాలు రావూరి సమత, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఎస్.మాధవి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

విజేతలు వీరే..

ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలో ఖమ్మం బుర్హాన్‌పురం ప్రాంతానికి చెందిన ఉసికెల రమాదేవి మొదటి బహుమతి, పాల్వంచకు చెందిన చుంచు రాజ్యలక్ష్మి ద్వితీయ, ఖమ్మం సుందరయ్యనగర్‌కు చెందిన కూరపాటి నిర్మల తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. వీరితో పాటు సంధ్యారాణి, మహంకాళి సునీత, రంగు లక్ష్మీ స్రవంతి, శ్రీలేఖ, యశోద కన్సొలేషన్ బహుమతులు దక్కించుకున్నారు.

భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉంది
వత్సవాయి రవి, శ్రీ బాలాజీ ఎస్టేట్స్ ఎండీ, ఖమ్మం

'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాలముగ్గుల పోటీల్లో తాము కూడా భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని బాలాజీ ఎస్టేట్స్, కన్‌స్ట్రక్షన్స్ ఎండీ వత్సవాయి రవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న మహిళలు ముగ్గులతో సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించారన్నారు.


ఉసికల రమాదేవి, ప్రథమ విజేత


చుంచు రాజ్యలక్ష్మి, ద్వితీయ విజేత


కూరపాటి నిర్మల తృతీయ విజేత

బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యాయి..

- అందుకే కాళేశ్వరం అవినీతిపై కేంద్రం ఉదాసీన వైఖరి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- సోనియా ఏకగ్రీవానికి అన్ని పార్టీలు సహకరించాలని పిలుపు


విలేకరులతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

వైరా, జనవరి 7: రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యాయని, అందువల్లే కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై కేంద్రప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తూ కేసీఆర్‌ను కాపాడుతోందని డిప్యూటీసీఎం మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఆదివారం తన స్వగ్రామమైన ఖమ్మం జిల్లా వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్‌కు కాళేశ్వరం ప్రాజెక్టు ఏటీఎంగా మారిందని విమర్శించిన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాల వద్ద కాళేశ్వరం దోపిడీ గురించి పూర్తి సమాచారం ఉన్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ వాస్తవాలను విస్మరించి బీజేపీ నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. ఏడాదికి రూ.2కోట్ల ఉద్యోగాలు, నోట్ల రద్దుతో నల్లధనాన్ని వెలికితీస్తామని చెప్పిన బీజేపీ నాయకులు వాటికి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మోసాలకు పాల్పడేది బీజేపీ మాత్రమేనని, కాంగ్రెస్ ప్రజల సంక్షేమాన్ని కోరుకుంటుందని తెలిపారు. రాష్ట్రంలో చిన్నాభిన్నమైన పాలన వ్యవస్థను గాడిలో పెట్టి జవాబుదారీతనం అందిస్తున్నామన్నారు. ఐదేళ్లుగా నుంచి ఉద్యోగులు 21వతేదీ వరకు జీతాలు తీసుకునే దుస్థితి నుంచి మొదటివారంలోనే జీతాలు తీసుకునేలా ఆర్థిక స్థితిని మెరుగుపర్చామని తెలిపారు. బీఆర్ఎస్‌లో జరిగిన ఆర్థిక అరాచకాలపై శ్వేతపత్రం విడుదల చేశామని, విద్యుత్ ఉత్పత్తి సరఫరాకు చెందిన జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌ల్లో ఉన్న అప్పులను బయటపెట్టామని, కాళేశ్వరం బాగోతాన్ని వెల్లడిచేశామని తెలిపారు. మిషన్ భగీరథలో అవకతవకలపై నివేదిక సిద్ధం చేస్తున్నామని, దాన్ని కూడా త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇక త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ ఎన్నికను ఏకగ్రీవ చేసేందుకు రాష్ట్రంలోని అన్ని పార్టీలు సహకరించాలని ఆయన రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీని వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో పోటీచేయాలని తాము కోరామని, తెలంగాణపై ప్రేమ ఉన్న రాజకీయ పార్టీలు సోనియాగాంధీపై పోటీ పెట్టకుండా ఏకగ్రీవ ఎన్నిక చేసి.. ఆమె రుణం తీర్చుకుందామన్నారు. ఈ సమావేశంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మే నెలాఖరుకు సీతారామ కాలువ పనులు పూర్తవ్వాలి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్

- వచ్చే సీజన్‌కు ఉమ్మడి జిల్లా భూముల్లో గోదావరి నీరు పారించాలి
- సత్తుపల్లి, పాలేరు టన్నెల్ నిర్మాణాలు వేగంగా చేపట్టండి
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం
- మంత్రులు పొంగులేటి, ఉత్తమ్‌తో కలిసి హైదరాబాద్‌లో సమీక్ష

ఖమ్మం, జనవరి 7 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ఉమ్మడిజిల్లాలో నిర్మాణంలో ఉన్న సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు కాలువల పనులను మే నెలాఖరు కల్లా పూర్తిచేయాలని, వచ్చే సీజన్‌కు సీతారామ ద్వారా ఉమ్మడిజిల్లా భూముల్లో గోదావరి నీటిని పారించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రూ.13500కోట్లతో నిర్మిస్తున్న సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుపై రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన ఆదివారం హైదరాబాదులో సమీక్ష నిర్వహించారు. ఇటీవల దమ్మపేట మండలం గండుగులపల్లిలో అధికారులతో సమీక్షించిన తుమ్మల వచ్చే సీజన్‌నాటికి సీతారామద్వారా సాగునీరందించాలనే లక్ష్యంతో హైదరాబాదులో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన పనులు, నిర్మాణంలో ఉన్నవి, బిల్లులు చెల్లింపు పెండింగ్ బిల్లులు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ఇరిగేషన్ అధికారులకు పలు సూచనల చేశారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ పెండింగ్‌లోని సీతారామ ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన పనులు వేగవంతం చేయాలని, మేనెలాఖరుకల్లా సీతారామకాలవ పనులు పూర్తిచేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలో గోదావరి జలాలను సాగునీరుగా అందించే లక్ష్యంతో చేపట్టిన పనులు వేగవంతంగా సాగితే ఈ ఏడాదిలోనే వైరా ప్రాజెక్టు, లంకసాగర్, ఎన్నెస్పీ ఆయకట్టులోని లక్ష60వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు రూ.7500కోట్లు ఖర్చుచేశారని, ఇప్పటికి మూడు పంపుహౌస్‌లు మాత్రమే పూర్తయ్యాయని, ఏన్కూరువద్ద లింక్‌కెనాల్ పనులకు టెండర్లు పూర్తిచేసి పనులు మొదలుపెట్టి వేగంగా సాగించాలని తెలిపారు. రూ.70కోట్లతో ఈ పనులు పూర్తిచేస్తే వచ్చే సీజన్‌లోనే సాగర్ ఆయకట్టులో సాగునీరు సీతారామద్వారా ఇవ్వవచ్చని తెలిపారు. ఇటీవల గండుగులపల్లిలో సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వివరించారు. యాతాకులకుంట భూసేకరణ పూర్తయితే సత్తుపల్లి టన్నెల్ ద్వారా లంకసాగర్, బేతుపల్లి కెనాల్‌కు సాగునీటికి అవకాశం ఉంటుందని, మేనెలాఖరుకల్లా అన్ని కాలవల పనులు పూర్తిచేయాల్సి ఉంటుందని, సత్తుపల్లి ట్రంక్‌కెనాల్‌కు సంబంధించి భూసేకరణకు రూ.12కోట్లు చెల్లించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సూచించారు. పాలేరు టన్నెల్ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు సైతం నీరందించే అవకాశం ఉంటుందని తెలిపారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా సీతారామ ప్రాజెక్టు పాలేరు లింక్‌కెనాల్ పనులపై చర్చించారు.

భద్రాద్రిలో నేడు విశ్వరూపసేవ



విశ్వరూప సేవకు సిద్ధమైన వేదిక

భద్రాచలం, జనవరి 7: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం విశ్వరూపసేవ(సర్వదేవతా అలంకారం) నిర్వహించనున్నారు. 24 రోజుల పాటు దేవస్థానంలో అధ్యయనోత్సవాలు జరిగిన అనంతరం 27వ రోజున వైకుంఠ ఏకాదశికి సరిగ్గా 16వ రోజున ద్వాదశి(నేడు) భద్రాద్రి రామయ్య సన్నిధిలో విశ్వరూప సేవ నిర్వహిస్తారు. ఇందుకోసం దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా విశ్వరూప సేవ సమయంలో స్వామి వారికి సమర్పించే కదంబంకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.

ఫిబ్రవరి 12 నుంచి వాగ్గేయకారోత్సవాలు

భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12 నుంచి భక్తరామదాసు జయంతి ప్రయుక్త వాగ్గేయకారోత్సవాలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 12న భక్త రామదాసు 391వ జయంతి ఉత్సవాన్ని నిర్వహించనుండగా 16 వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు మల్లాది సూరిబాబు, ఆయన కుమారులు మల్లాది శ్రీరామ్ ప్రసాద్, రవికుమార్‌లతో పాటు మరెందరో సంగీత కళాకారులు తరలి రానున్నారు. భద్రాద్రి దేవస్థానం శ్రీచక్రా సిమెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం గత కొంతకాలంగా సాగుతోంది.


రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి

కోయగూడెం ఓసీ సందర్శనలో సింగరేణి సీఎండీ బలరాం

టేకులపల్లి, జనవరి 7: సంస్థ కేటాయించిన వార్షిక లక్ష్యాలను సాధించేందుకు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలని సింగరేణి సీఅండ్ఎండీ ఎన్.బలరాం ఆదేశించారు. ఇల్లెందు ఏరియాలోని కోయగూడెం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులో ఆదివారం ఆయన పర్యటించి పని ప్రదేశాలను సందర్శించారు ఈ సందర్భంగా వ్యూపాయింట్ నుంచి క్వారీలో ఓబీ, బొగ్గు వెలికితీత పనులను సీఎండీ పరిశీలించారు. పని ప్రదేశాలను సందర్శించి బొగ్గు ఉత్పత్తి చేస్తున్న సర్ఫేస్‌మైనర్ పనితీరుతో పాటు రోజువారి ఉత్పత్తి, రవాణాను ఏరియా జీఎం జాన్ ఆనంద్‌ను అడిగి తెలుసుకొన్నారు. అంతకు ముందు అధికారులు ఆయనకు పూలమొక్కను అందచేసి అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్(పీపీ)జి.వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్ ఆపరేషన్ ఎన్‌వీకే శ్రీనివాస్, సేఫ్టీ జీఎం గురువయ్య, జీఎం సెక్యూరిటీ దీక్షితులు, ప్రాజెక్టు ఆఫీసర్ ప్రహ్లాద్, డీజీఎం పర్సనల్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


కేవోసీని పరిశీలిస్తున్న సీఎండీ బలరాం

మూతబడికి మోక్షం



- విద్యార్థులు లేక 54 పాఠశాలలు మూత
- నివేదిక సిద్ధం చేసిన ఖమ్మం జిల్లా విద్యాశాఖ
- ప్రభుత్వం ఆదేశిస్తే ఆయా పాఠశాలలు పునఃప్రారంభమయ్యే అవకాశం

ఖమ్మం ఖానాపురం హవేలీ, జనవరి 7: "రాష్ట్రంలో ప్రతి పంచాయతీ పరిధిలో పాఠశాల ఉండాలి.. కుగ్రామాలు, మారుమూల తండాల్లోనూ ప్రభుత్వ బడి ఉండాల్సిందే.. ఉపాధ్యాయులు లేరనే కారణంతో మూసివేసిన బడులను వెంటనే తెరిపించాలి" ఇవీ ఇటీవల హైదరాబాద్‌లో విద్యాశాఖతో జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులుకు ఇచ్చిన ఆదేశాలు.. ప్రతి ఒక్కరికి విద్య అందించడమే లక్ష్యంగా ఏ ఒక్క విద్యార్థి ఇతర గ్రామాలు, పట్టణాలకు వెళ్లే పరిస్థితి ఎదురవ్వొద్దనే నిర్ణయం విద్యార్థులకు మేలు చేయనుంది. కానీ గతంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో జిల్లాలో అనేక పాఠశాలలు మూతపడ్డాయి. ఎంత మంది పిల్లలున్నా పాఠశాలను నిర్వహించాల్సిందే అని ఇటీవల సీఎం సూచించడంతో మూతబడినవి తెరుచుకునే ఆస్కారం ఏర్పడింది. ఫలితంగా జిల్లాలో 54 సర్కారు విద్యాలయాలు పునఃప్రారంభమయ్యే అవకాశం ఉంది. మూతపడ్డ వాటితో పాటు పాఠశాలలు లేని పంచాయతీల వివరాలు పంపించాలని రాష్ట్ర విద్యాశాఖ నుంచి జిల్లాకు ఆదేశాలు రావడంతో అధికారులు సంబంధిత ప్రక్రియను చేపట్టి జిల్లాలో పాఠశాలలు లేని గ్రామాలు 54ఉన్నట్లు తేల్చారు. ప్రభుత్వం కచ్చితమైన నిర్ణయంతో ముందడుగు వేస్తే వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్నిచోట్ల సంపూర్ణంగా సర్కారు పాఠశాలలు అందుబాటులోకి రానున్నాయి.

ప్రస్తుతం 60 వేలకు పైగా విద్యార్థులు

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఆదర్శ, కస్తూర్బా, గురుకులాలు మొత్తం కొనసాగుతున్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 80వేల మంది చిన్నారులు చదువుతున్నారు. పాఠశాలల హేతుబద్ధీకరణలో భాగంగా 2015లో 54 బడులను మూసివేశారు. విద్యార్థుల సంఖ్య లేరనే కారణంతో అధికారులు చర్యలు చేపట్టారు. వాటిల్లో అత్యధికంగా ప్రాథమిక పాఠశాలలే. విద్యార్థులు లేని కారణంగా 2015 తరువాత ఆ పాఠశాలలను తెరవడం లేదు. ఈ జాబితాలో సింగరేణి మండలలో 4 ప్రాథమిక పాఠశాలలు, కామేపల్లిలో 4, రఘునాథపాలెంలో 3, ఖమ్మం రూరల్‌లో 1, తిరుమలాయపాలెంలో 5, నేలకొండపల్లిలో 2, ముదిగొండలో 2, ఏన్కూరులో 1, కల్లూరులో 7, పెనుబల్లిలో 7, సత్తుపల్లిలో 2, వేంసూరులో 1, తల్లాడలో 6, వైరాలో 1, మధిరలో 4, ఎర్రుపాలెం మండలంలో 2, బోనకల్ మండలంలో 1 ప్రాథమిక పాఠశాల విద్యార్థులు లేరనే కారణంతో మూసివేశారు. వైరా మండలంలోని అష్టగుర్తి ఉన్నత పాఠశాలను కూడా ఇదే కారణంతో మూసివేశారు.


మూతపడిన వైరా మండలం అష్టగుర్తి జడ్పీఉన్నత పాఠశాల

మూతబడ్డ పాఠశాలల నివేదిక అందించాం
సోమశేఖర శర్మ, ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి

జిల్లాలోని మూతబడిన పాఠశాలల వివరాలను కలెక్టర్‌తోపాటు విద్యాశాఖ ఉన్నతాధికారులకు అందించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే నిర్దేశిత పాఠశాలలను తెరుస్తాం. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా చర్యలు తీసుకుంటాం. మూతబడిన, తెరవని వాటితో పాటు పాఠశాలలు లేని గ్రామాల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తాం. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.


ప్రభుత్వ స్థలానికి వేసిన ఫెన్సింగ్

ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్

- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికారులు
- 59జీవో తిరస్కరణ దరఖాస్తుల భూములు స్వాధీనం

ఖమ్మం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో భాగంగా కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాల మేరకు ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లోని స్థలాలకు అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు జారీచేసిన జీవో 59కింద నిబంధనలకు విరుద్ధంగా అక్రమ క్రమబద్ధీకరణ కోసం ప్రయత్నం చేసిన స్థలాలను గుర్తించి వాటికి రక్షణ కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయన ఆదేశాలకు అనుగుణంగా ఖమ్మం అర్బన్ పరిధిలో ఖానాపురం సర్వే 272లో 300 గజాలు, ఖానాపురం డొంకలో 200, 150 గజాలు ప్లాట్లు, వెలుగుమట్లలో 412 సర్వే నెంబరులో 300గజాల స్థలాలకు సంబంధించి ఎలాంటి నిర్మాణాలు లేకపోయినా కొందరు జీవో 59 కింద దరఖాస్తు చేయగా వాటిని తిరస్కరించగా.. సుమారు రూ. 4.35 కోట్ల విలువైన సదరు స్థలాలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది నిఘాపెట్టి ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. కాగా ఇటీవల వెలుగులోకి వచ్చిన 59 జీవో అక్రమ క్రమబద్ధీకరణల వ్యవహారంపై ఇప్పటికే విచారణకు ఆదేశించినట్టు సమాచారం. విచారణను త్వరితగతిన పూర్తిచేసి సంబంధిత అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

28న పంచాయతీ కార్మికుల రాష్ట్ర మహాసభలు

- ఇఫ్టూ అనుబంధ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి7: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా ఈనెల 28న వనపర్తిలో ఇఫ్టూ అనుబంధ గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్రమొదటి మహాసభలు నిర్వహిస్తున్నామని, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు అమర్లపూడి అప్పారావు, పగిడికత్తుల రామదాసు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. మహాసభల నిర్వహణతో కార్మికుల ఐక్యతను ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. సమస్యలపై చర్చించి తీర్మానాలు చేసి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల అశోక్, నాయకులు మేగడ సైదులు, కత్తుల బిక్షం, అక్బర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కు'బడి చదువులు'

» ఉపాధ్యాయులపై రోజంతా టీచింగ్ భారం
» విద్యార్థుల భవిష్యత్ అయోమయం

తల్లాడ, జనవరి 7: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయుడితో విద్యాబోధన మొక్కు'బడి'గా సాగుతోంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఏకోపాధ్యాయుడు రోజుకు లెక్కకు మించి పిరియడ్లు విద్యార్థులకు బోధించాల్సి రావడం భారంగా మారింది. ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు బోధించటం వల్ల విద్యార్థులకు పాఠ్యాంశాలు సక్రమంగా అర్థంకాక అయోమ యానికి గురవుతున్నారు. ప్రస్తుతం తల్లాడ మండలంలోని రామచంద్రాపురం, కొత్తవెంకటగిరి, వెంకట్రామునితండా, రంగంబంజర, నారయ్యబంజర, కేశ్వాపురం, మిట్టపల్లి, ముద్దునూరు, బస్వాపురం గ్రామాల్లోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో ఉపాధ్యాయుడే విధులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలల్లో ఒకట్రెండు తరగతులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులు, 3,4,5 తరగతులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులు బోధించాల్సి వస్తుంది. ఏకోపా ధ్యాయుడి పాఠశాలల్లోని ఐదు తర గతులను నిర్వహించాల్సి రావడం వల్ల ప్రభుత్వ పాఠశా లల్లో చదివే పేద విద్యార్థులకు సరైన విద్యాబోధన జరగని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్టులకు సరిపడా ఉపాధ్యాయులు


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఏకోపాధ్యాయుడు

లేక మొక్కుబడి విద్యా బోధన జరుగుతుండటంతో ఆశించిన రీతిలో విద్యాప్ర మాణాలు లేకపోవడంతో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించకుండా ప్రైవేట్ విద్యాసంస్థల వైపు మొగ్గుచూపుతున్న పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో సబ్జెక్టుల కనుగుణంగా ఉపాధ్యాయులను నియమించి విద్యాప్ర మాణాలను పెంచాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎఫ్ఎల్ఎన్ లక్ష్యం నీరుగారుతుంది
కె.శ్రీకాంత్, యూటీఎఫ్ తల్లాడ మండల అధ్యక్షుడు



ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిపై పనిభారం పెరుగుతోంది. దీంతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను పెంచటానికి రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న ఎఫ్ఎల్ఎన్ లక్ష్యం నీరుగారుతోంది. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటేనే ఎఫ్ఎల్ఎన్ అమలు చేయటానికి దోహదపడుతుంది. ఒకే ఉపాధ్యాయుడు బోధనేతర, బోధన పనులు నిర్వహించటం తలకు మించిన భారంగా ఉంది. ఇది విద్యార్థుల భవిష్యత్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది.

విద్యార్థులకు నాణ్యమైన బోధన జరగటం లేదు
షేక్.రఫీక్ పాషా, పీఆర్టీయూ తల్లాడ మండల అధ్యక్షుడు



ఏకోపాధ్యాయుడి వల్ల బోధన విషయంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందక పూర్తిస్థాయిలో న్యాయం జరగడం లేదు. విద్యాప్రమాణాలు తగ్గడంతో రానురాను ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పడిపోతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం స్థానిక సంస్థలు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషిచేయాల్సి ఉంది. ఏకోపాధ్యాయ వ్యవస్థను ప్రక్షాళన చేసి సబ్జెక్టులకనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలి.

జంగారెడ్డిగూడెంలో గోటి తలంబ్రాలను

ప్రారంభించిన భద్రాద్రి ఈవో

భద్రాచలం, జనవరి 7: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యం లో ప్రతి ఏటా నిర్వహించే శ్రీరామనవమిని పురస్కరించుకొని సమర్పించే గోటితలంబ్రాలను ఒలిచే కార్యక్రమాన్ని దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఆదివారం ప్రారంభించారు. ఏపీలోని జంగారెడ్డిగూడెంలో ఉన్న మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో జ్యోతి ప్రజ్వలన, గిరి ప్రదక్షిణ నిర్వహించి గోటి తలంబ్రాల కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈవో భవానీ రామకృష్ణారావు, వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్, రామాయణపారాయణదారులు అంతర్వేది కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.


గిరిప్రదక్షిణ చేస్తున్న దేవస్థానం ఈవో, వైదిక సిబ్బంది

జమలాపురం ఆలయం మాజీ చైర్మన్ కన్నుమూత

ఎర్రుపాలెం, జనవరి7: జమలాపురం ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ ఉప్పల శివరామప్రసాద్‌శర్మ (77) ఆదివారం కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాదులోని తన కుమార్తె ఇంటివద్ద తుది శ్వాస విడిచారు. జమలాపురం ఆలయానికి ధర్మకర్తగా, ధర్మకర్తల మండలి చైర్మన్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు. ఆలయానికి విరాళాలు సేకరించడంలో ఆలయం అభివృద్ధికి తనదైన కృషిచేశారు. దేవాదాయశాఖ నుంచి పదవీకాలంలో అర్చకులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. పలురాజకీయ నాయకులు , ప్రముఖులు, రిటైర్డు దేవాదాయశాఖ అధికారులు, ఆలయ సిబ్బంది, అర్చకులు తమ సంతాపాన్ని తెలిపారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలున్నారు.


శివరామప్రసాద్‌శర్మ

మత సామరస్యాన్ని చాటిన

ముస్లిం నాయకుడు

ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ


ఖానాపురంలో హిందూ సంప్రదాయ దుస్తులు ధరించి అక్షింతలు పంపిణీ చేస్తున్న జడ్పీకోఆప్షన్ సభ్యుడు లాల్‌మహ్మద్

వైరా, జనవరి 7: ఖమ్మం జడ్పీ కోఆప్షన్ సభ్యుడు షేక్.లాల్‌మహ్మద్ మతసామరస్యాన్ని చాటుకున్నారు. వైరా మండలంలోని తమ స్వగ్రామమైన ఖానాపురంలో ఆదివారం శ్రీరామభక్తులతో కలిసి సంప్రదాయ దుస్తులు ధరించి అయోధ్య రాముడి చెంత విశిష్ట పూజలందుకున్న అక్షింతలు ఇంటింటికి అందించే కార్యక్రమంలో లాల్‌మహ్మద్ పాల్గొన్నారు. స్వయంగా అక్షింతలను మోస్తూ ఇంటింటికి భక్తులతో కలిసి పంపిణీ చేశారు. అలాగే వైరాలో కూడా మహిళా భక్తులు ఇంటింటికి అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖానాపురానికి చెందిన ఏపీఎస్.రెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, ముత్తినేని రామారావు, మట్టా హుస్సేన్, తోట సత్యం, కట్ల రంగారావు, ఐదోవార్డు కౌన్సిలర్ మాదినేని సునీత, మహిళా భక్తులు అనుమోలు కుమారి, మిట్టపల్లి మంజుల, రంగా వాసవి, అన్నపూర్ణ, భారతి, జానకీ, రాజ్యలక్ష్మీ, జ్యోతి, శ్రావణి పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో కొండ ముచ్చు మృతి


కోతుల దాడుల్లో మృతి చెందిన కొండ ముచ్చు

భద్రాచలం, జనవరి 7: భద్రాచలంలో ఆదివారం ఒక కొండముచ్చును సుమారు 20 వీధి కుక్కలు తీవ్రంగా గాయపరచడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో ఈ సమాచారం అందుకున్న భద్రాచలం వెటర్నరీ వైద్యులు డా. శివరామకృష్ణ ప్రసాద్ అక్కడకు తమ స్నేహితులతో వెళ్లి తీవ్ర గాయాలైన కొండముచ్చుకు చికిత్స అందించారు. కొండముచ్చు కాలు దగ్గర తీవ్ర గాయం కావడంతో దానిని శుభ్రం చేసి చికిత్స అందించారు. కాగా గాయాలు తీవ్రంగా కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగి ఆ కొండ ముచ్చు మృతి చెందింది. ఈ కార్యక్రమంలో గిరి, ఎలిపే కుమార్, అటవీశాఖ ఉద్యోగి కేవల్ రామ్ పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య


వెంకటేష్(ఫైల్)

నేలకొండపల్లి, జనవరి7: మండల పరిధిలోని ఆచర్లగూడెం గ్రామానికి చెందిన మాదాల వెంకటేష్(19) అనే డిగ్రీ విద్యార్థి ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన మాదాల ఆదినారాయణకు ఇరువురు కుమారులు. పెద్ద కుమారుడు వెంకటేష్, ఖమ్మంలోని ఓకళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఏం జరిగిందో తెలియదు కానీ వెంకటేష్ ఆదివారం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలుస్తున్నది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. గ్రామస్థులు వివరాలు తెలపటానికి ముందుకు రాలేదు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి, జనవరి7: మండల పరిధిలోని కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన మౌలాలీ అనే వివాహిత ఆత్మహత్యకు యత్నించింది. ఆదివారం ఇంట్లో చిన్న ఫంక్షన్ జరిగింది. ఫంక్షన్‌లో ఏం జరిగిందో తెలియదు కానీ, మౌలాలీ ఇంట్లోని ఓగదిలోకి వెళ్లి ఉరి వేసుకున్నట్లుగా సమాచారం. గమనించిన కుటుంబ సభ్యులు నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చి ప్రాథమిక చికిత్స చేయించిన అనంతరం, మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. మౌలాలీ దుబాయ్‌లో ఉద్యోగం చేస్తోందని, భర్త షేక్.యూసుఫ్ వైజాగ్‌లో పని చేస్తాడని గ్రామస్థులు తెలిపారు. దాదాపు 10 రోజుల క్రితమే యూసుఫ్, మౌలాలీలు ఫంక్షన్ నిమిత్తం కొత్తకొత్తూరులోని సొంత ఇంటికి వచ్చారు.

భద్రాచలం అభివృద్ధి కోసం మరో పోరాటం

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

భద్రాచలం, జనవరి 7: భద్రాచలం ప్రాంత అభివృద్ధ కోసం మరో కీలక పోరాటానికి సిద్ధం కావాలని భద్రాచలంలో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. అతిపెద్దగా ఉన్న దుమ్ముగూడెం, చర్ల మండలాలను విభజించి శ్రీ సీతారామ మండలంగా ఏర్పాటు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. అలాగే భద్రాచలం, పినపాక అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 13 మండలాలను కలిపి భద్రాద్రి శ్రీరామ పేరుతో నూతన జిల్లాను భద్రాద్రి కేంద్రంగా ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం చోటు చేసుకున్న ప్రత్యేక పరిస్థితుల్లో పోలవరం ముంపు పేరుతో ఏపీ పరిధిలోకి మండలాలు వెళ్లడంతో ఉనికి కోల్పోయిన భద్రాచలంకు ఏపీ పరిధిలోకి వెళ్లిన ఐదు పంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలపాలన్నారు. భద్రాద్రి రాముడు తెలంగాణ దేవుడు అనే నినాదంతో ఆనాడు తెలంగాణ ఉద్యమకారులు పోరాడగా నేడు భద్రాద్రి రాముడు తెలంగాణలో భూములు ఆంధ్రాలో ఉండటంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అదేవిధంగా పాండురంగాపురం నుంచి భద్రాచలంకు రైల్వే లైను ఏర్పాటు చేయాలని, భద్రాద్రి ప్రాశస్త్యం ఏ మాత్రం తగ్గకుండా అయోధ్య, యాదాద్రి తరహాలో భద్రాద్రిని తీర్చిదిద్దాలని సీఎం ఎ.రేవంత్‌రెడ్డి జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులకు డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశం పూనెం ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా పట్టణ ప్రముఖులు అడుసుమల్లి జగదీష్, పల్లింటి దేశప్ప, బోళ్ల వెంకటేశ్వర్లు, కృష్ణప్రసాద్, అలవాల రాజా, భూపతిరావు, న్యాయవాది తిరుమలరావు, రాజకీయ పార్టీల నాయకులు ఎస్కే అజీమ్, కొడాలి శ్రీనివాసన్, కెచ్చెల కల్పన, ఎంబీ నర్సారెడ్డి, గద్దం స్వామి, ఆవుల సుబ్బారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు



రైతన్నా.. జర భద్రం!

రఘునాథపాలెం, జనవరి7: మండలంలో ధాన్యం నూర్పిళ్లు జోరుగా సాగుతున్నాయి. ఈక్రమంలో రైతులు ధాన్యంతో పాటు వరిగడ్డిని ఇళ్లకు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇలా తరలించే సమయంలో ట్రాక్టర్ టాప్‌పై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. గతంలో మండలంలో ఈ తరహా ప్రమాదాలు జరిగి చాలా మంది చనిపోయారు. కొందరు క్షతగాత్రులు కూడా అయ్యారు. రఘునాథ పాలెం మండలంలో రాంక్యాతండా రహదారిపై ప్రమాదకరంగా ట్రాక్టర్ టాప్ పై ప్రయాణిస్తున్న రైతుల ఫొటోను ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది.


పరివర్తన బృందం తో దేవస్థానం ప్రధాన అర్చకులు వసుధ ఫౌండేషన్ కన్వీనర్

రామయ్యను దర్శించిన

పరివర్తన స్వచ్ఛంద సంస్థ విద్యార్థులు

భద్రాచలం, జనవరి 7: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి ఆలయాన్ని ఏపీలోని కాకినాడకు చెందిన పరివర్తన స్వచ్ఛంద సంస్థ ద్వార విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు దర్శించుకున్నారు. శనివారం రాత్రి భద్రాచలం చేరుకున్న వారు ఆదివారం పరివర్తన సంస్థ ప్రతినిధి వక్కలంక రామకృష్ణ, ఇతర సభ్యుల సహకారంతో రామయ్యను దర్శించుకున్నారు. ఇందుకోసం వీరికి సీతానిలయం కాటేజీ దాత పీఎల్ రాజు కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం వసతి సౌకర్యానికి సహకారం అందజేసింది. అలాగే రామయ్యను దర్శించిన పరివర్తన స్వచ్ఛంద సంస్థ సభ్యులతో పాటు 50 మంది విద్యార్థులకు స్వామి వారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం భద్రాద్రి దేవస్థానం ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, వసుధ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు ద్వారా అందజేశారు.

ఇంట్లోకి వచ్చి దౌర్జన్యం చేశారని ఫిర్యాదు

ఖమ్మం క్రైం, జనవరి 7: ఇంటిలోకి వచ్చి అక్రమంగా కొంతమంది వ్యక్తులు కావాలని దాడిచేసి దౌర్జన్యం చేశారంటూ ఓ మహిళ ఆదివారం ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని ద్వారకానగర్‌లో అబ్బాస్ అను వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి నగరానికి చెందిన యాహాన్ అనే వ్యక్తితో పాటు ముస్తఫా అనుచరులు కొంతమంది అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి దుర్భాష లాడుతూ దౌర్జన్యం చేశారని ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఇంట్లోని కొంత నగదు కూడా పోయినట్టు అబ్బాస్ భార్య సమీరాబేగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఎల్లమ్మ, ఉప్పలమ్మతల్లి ఆలయంలో చోరీ


పగలగొట్టిన హుండీలను పరిశీలిస్తున్న పోలీస్ అధికారి


మధిర రూరల్, జనవరి 7: మధిర మండలం దెందుకూరు-నిదానపురం క్రాస్‌రోడ్డు వద్దనున్న ఎల్లమ్మ, ఉప్పలమ్మ తల్లి(అమరావతి అమరలింగేశ్వరస్వామి) ఆలయంలో శనివారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని రెండు హుండీలను పగులగొట్టి అందులోని రూ.పదివేలను దొంగిలించారని ఆలయ పూజారి నర్సింగ చిన్నపుల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం పోలీసులు చోరీ జరిగిన ఆలయాన్ని సందర్శించి పరిశీలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్లూరు.. మునిసిపాలిటీగా మారేనా?

» పురపాలకంగా అప్ గ్రేడ్ చేసేందుకు అన్ని అర్హతలు » గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు

కల్లూరు, జనవరి 7: ఎప్పటి నుంచో మేజర్ గ్రామ పం చాయతీగా ఉన్న కల్లూరు పట్టణానికి ప్రభుత్వ నింబం ధనల ప్రకారం మునిసిపాలిటీ అయ్యేందుకు విధాలుగా అ ర్హతలున్నాయి. ఆరు సంవత్సరాల క్రితమే కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ కావాల్సి ఉండేది. అదే క్రమంలో ప్రస్తుత పంచాయతీ పాలకవర్గం కూడా కల్లూరును మునిసిపాలిటీగా చేసే విషయంలో ప్ర భుత్వానికి తీర్మానాలు చేసి ప్రతిపాదనలు పంపింది. గత పాలకులు కూడా అదే స్థాయిలో కల్లూరును మునిసి పాలిటీగా తీర్చిదిద్దే విషయంలో పలు దఫాలుగా హామీలు కూడా ఇచ్చారు. అంతకు ముందు పంచాయతీ ఎన్నికల స మయంలో పలు రాజకీయ పరమైన కారణాలతో కల్లూరు మునిసిపాలిటీ కల నేర వేరలేదు. తాజాగా రాష్ట్రంలో కాం గ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటం. ఆ తరువాత క ల్లూరు మండలానికి చెం దిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర రెవెన్యూ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సంద ర్భంగా కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు విషయమై ప్రస్తవించారు. ఆ క్రమంలో ఈ ప్రాంత ప్రజల్లో మరో సారి కల్లూరు మునిసిపాలిటీ ఉన్నతి పొందే విషయమై మరోసారి ఆశలు చిగురించాయి.


కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం


కల్లూరు మ్యాప్

కల్లూరుకున్న అర్హతలే ఇవే...

1964లో కల్లూరు గ్రామ పంచాయతీగా ఏర్పడింది. నాటి నుంచి దినదినాభివృద్ధి చెందుతోంది 30 సంత్సరాల క్రితం నుంచే కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీగా ఎదిగింది. ఇప్పుడు 22 వేల జనాభా కలిగి ఉండటమే కాక 13 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. కల్లూరు మేజర్ పంచాయతీ పరిధిలో గోపాదేవబోయినపల్లి, శ్రీరాంపురం, ఖాన్‌ఖాన్‌పేట ఉన్నాయి. మూడు కిలోమీటర్ల పరిధిలో పలు గ్రామాలున్నాయి. ఆదాయ, రాబడిలో కూడా నేడు కల్లూరు మేజర్ పంచాయతీ జిల్లా స్థాయిలో ముం దంజలో ఉంది. రెవెన్యూ డివిజన్‌గా ఎదిగిన కల్లూరు పట్టణానికి నైసర్గికంగా, భౌతి కంగా అన్ని విధాలుగా మునిసిపాలిటీగా అర్హతలున్నాయి. త్వరలో గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీకాలం పూర్తికానున్న నేపథ్యంలో కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ మునిసిపాలిటీగా మారే విషయమై స్థానిక ప్రజానీకంలో చర్చనీయాం శంగా మారింది.

మునిసిపాలిటీగా అన్ని అవకాశాలున్నాయి
లక్కినేని నీరజ రఘు, సర్పంచ్ కల్లూరు



కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీని మునిసిపాలిటీగా (ఉన్నతి) చేసేందుకు అన్ని విధాలుగా అవకాశాలున్నాయి. రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఎదిగిన కల్లూరు పట్టణా న్ని మునిసిపాలిటీగా చేసే విషయమై గతంలోనే పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపింది. మరలా పంపేందుకు సిద్ధంగా ఉన్నాం. జనాభా, ఓటర్లు నిష్పత్తి కూడా ఉంది. శివారు గ్రామాలు కలిగి ఉంది. మున్సిపాలిటీ అయితే కేంద్రం నుంచి అదనంగా నిధులు వస్తాయి.

మరింత అభివృద్ధి జరుగుతుంది
పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు



కల్లూరు మేజర్ పంచాయతీని మునిసిపాలిటీగా చేసేందుకు అన్ని విధాలుగా అర్హత ఉన్నాయి. ఆదాయం, వనరులు అందుబాటులో ఉన్నాయి. జనాభా కూడా అందుకు అనుగుణంగా ఉంది. మేం గతంలోనే కల్లూరు మునిసిపాలిటీగా చేసే విషయంలో ప్రభుత్వానికి, జిల్లా అధికారులకు తగిన సమాచారం అందించాం. ఇప్పటికి కూడా పాలకవర్గం ఆమోదంతో తగిన ప్రతిపాదనలు పంపేందుకు సిద్ధంగా ఉన్నాం. అభి వృద్ధి కూడా మరింత జరుగుతుంది. నిధులు ఎక్కువగా వస్తాయి. ప్రజలు కూడా కల్లూరును మునిసిపాలిటీని చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ దగ్ధం

అశ్వారావుపేట రూరల్, జనవరి 7: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలో ఆదివారం జరిగింది. మండలంలోని గాండ్రాల గ్రామంలో మహేష్ అనే రైతు పొలంలో వేలేరుపాడు మండలంలోని ఓ యజమాని ట్రాక్టర్ ద్వారా ధాన్యం నూర్పిడి చేస్తున్నారు. ఇదే క్రమంలో ట్రాక్టర్ ఇంజన్ భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు బలంగా వ్యాప్తించటంతో ట్రాక్టర్ పూర్తిగా కాలిపోగా వడ్లు నూర్చే యంత్రం కూడా కొంతమేర దెబ్బతిన్నది. ప్రమాదం వలన సుమారు రూ.8 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.


మంటల్లో కాలిపోతున్న ట్రాక్టర్

రహదారులు రక్తసిక్తం

ఇరు జిల్లాల్లో వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు: ముగ్గురి దుర్మరణం

జూలూరుపాడు/ ఖమ్మం రూరల్/ తల్లాడ, జనవరి7: రహదారులు రక్తసిక్తమయ్యాయి. ఆదివారం ఇరు జిల్లాల్లో వేరువేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు.

జూలూరుపాడు మండలం అనంతారంలో..

జూలూరుపాడు మండలంలోని అనంతారం గ్రామంలో ఆదివారం ద్విచక్రవాహనాన్ని జేసీబీ ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే అనంతారం గ్రామానికి చెందిన పూనెం నాగేశ్వరరావు(30) ద్విచక్ర వాహనంపై కాకర్ల నుంచి అనంతారం గ్రామానికి వస్తున్నాడు. ఆ సమయంలో అనంతారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో జేసీబీ పని చేసి బయటికి వస్తుంది. ఈ క్రమంలో జేసీబీ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో నాగేశ్వరరావు తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఏఎస్ఐ తిరుపతిరావు, హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ సందర్శించి వివరాలను నమోదు చేసుకున్నారు. మృతుడు తల్లి సీతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా నాగేశ్వరరావు తండ్రీ కొన్నేళ్ళ క్రితం మృతి చెందాడు. తల్లి సీతమ్మ, నాగేశ్వరరావు, అతని సోదరుడు అచ్చయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు మృతి చెందడంతో తల్లి సీతమ్మ రోధనలు మిన్నంటాయి. గ్రామంలో విషాధ ఛాయలు అలుముకున్నాయి. యువకుడు మృతి చెందా డన్న విషయం తెలుసుకొని గ్రామస్తులు చూసేందుకు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. జేసీబీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం వల్లే నాగేశ్వరరావు మృతి చెందాడని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.


మృతి చెందిన పూనెం నాగేశ్వరరావు

చికిత్స కోసం బయల్దేరి వ్యక్తి..

జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆదివారం తల్లాడ మండలం మిట్టపల్లి స్టేజీ వద్ద చోటుచేసుకుంది. రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొన్న ప్రమాదంలో తల్లాడ మండలం రామానుజవరం గ్రామా నికి చెందిన బొగ్గుల కృష్ణారెడ్డి(60)అక్కడికక్కడే మృతిచెందాడు. జ్వరంతో బాధపడుతున్న కృష్ణారెడ్డిని ఇంటి వద్ద నుంచి తమ్ముడు వెంకటరెడ్డి తన ద్విచక్రవాహనంపై మిట్టపల్లిలోని ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు బయల్దేరారు. మిట్టపల్లి స్టేజీ వద్ద ద్విచక్రవాహనం దిగి ఆసుపత్రిలోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కృష్ణారెడ్డిని తల్లాడ నుంచి కల్లూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కృష్ణారెడ్డికి ఇద్దరు కుమారులున్నారు. తమ్ముడు వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు తల్లాడ ఎస్ఐ పి.సురేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనాస్థలంలో రాజశేఖర్ మృతదేహం

చెట్టుకు బైక్ ఢీ కొని యువకుడు..

చెట్టుకు ద్విచక్రవాహనం ఢీ కొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున రూరల్ మండలం, మారెమ్మగుడి ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం నగరం అగ్రహారం కాలనీ చెందిన ముమ్మడి రాజశేఖర్(27) అనే యువకుడు తన ద్విచక్రవాహనంపై ములకలపల్లి వైపు నుండి ఖమ్మం వస్తున్నాడు. మారెమ్మగుడి దాటిన తరువాత రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ద్విచక్రవాహనం ఢీ కొట్టుకుని ఆ యువకుడు అక్కడి కక్కడే మృతి చెందా డు. స్థానికుల పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అన్నంసేవా ఫౌండేషన్ సభ్యులు అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. యువకుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

ముగ్గులు ఫ్రూస్‌ ముచ్చటి గొలిప్‌

- ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 7: చుక్కల ముగ్గులు.. చూడచక్కని రంగులు.. వాటిలో అందమైన పువ్వులు, సంప్రదాయానికి ప్రతీక అయిన గొబ్బెమ్మలు వెరసి ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గులు మెరిశాయి. మహిళల చేతుల్లో మంత్రదండమేమైనా ఉందేమో అనిపించేలా, ఆకాశంలోని నక్షత్రాలు భూమి మీదకు దిగివచ్చాయా అనిపించేలా ముచ్చటైన ముగ్గులు అందరినీ అబ్బుర పరిచాయి. మహిళల్లోని ప్రతిభకు, సృజనాత్మకతకు వేదికగా ముగ్గుల పోటీలు నిలిచాయి. అవనిపై హరివిల్లు సోయగాలు విరబూశాయి. ముగ్గులు మొగ్గలై అందరినీ అలరింపజేశాయి. సప్తవర్ణాలు భూతల్లిని సింగారించాయి 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' ముత్యాలముగ్గుల పోటీలు ఆదివారం ఖమ్మంలో ఘనంగా జరిగాయి. ఖమ్మం శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అండ్ కనస్ట్రక్షన్స్ సంస్థ సహకారంతో నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రం ఆవరణలో జరగ్గా.. మహిళలు అధికసంఖ్యలో హాజరై రంగవల్లులను తీర్చిదిద్దారు. ఉదయం 10 గంటలకే మహిళలు పోటీల ప్రాంగణానికి చేరుకుని, తమ పేర్లు నమోదు చేసుకున్నారు. తమకు కేటాయించిన బాక్సుల వద్దకు వెళ్లి రంగులు సిద్ధం చేసుకున్నారు. ముచ్చటైన ముగ్గులను దిద్ది, చూడచక్కని రంగులను దిద్దారు.


ప్రథమ విజేత ఉసికల రమాదేవికి బహుమతి అందజేస్తున్న ఆంధ్రజ్యోతి ప్రచురణ కర్త కోగంటి వెంకట శేషగిరిరావు


ద్వితీయ విజేత చుంచు రాజ్యలక్ష్మికి బహుమతి ప్రదానం చేస్తున్న బిలీఫ్ ఆసుపత్రి నిర్వాహకురాలు మోడెంపూడి రమాజ్యోతి


తృతీయ విజేత కూరపాటి నిర్మలకు బహుమతి అందజేస్తున్న ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జ్ నలజాల వెంకటరావు


ముత్యాల ముగ్గుల పోటీలో కన్సోలేషన్ బహుమతులు అందుకుంటున్న సంధ్యారాణి, మహంకాళి సునీత, రంగు లక్ష్మీ ప్రవంతి, ఎం. శ్రీలేఖ, యశోద


రంగవల్లికలను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు


ద్వితీయ బహుమతి పొందిన చుంచు రాజ్యలక్ష్మి


తృతీయ బహుమతి పొందిన కూరపాటి నిర్మల


ముగ్గులను పరిశీలిస్తున్న ఆంధ్రజ్యోతి బృందం


ముగ్గులు దిద్దుతున్న మహిళలు

ఆత్మవిశ్వాసం పెరిగింది
ఉసికెల రమాదేవి, మొదటి బహుమతి విజేత

ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలో బహుమతి సాధించటం వల్ల నాలో ఆత్మ విశ్వాసం మరింత పెరిగింది. నేను బ్యూటీషియన్‌ని, మావారు ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తారు. నాకు ఇద్దరు అబ్బాయిలు, నాకు ముగ్గుల కళమీద నాకు ఎంతో మక్కువ ఉంది చాలా పోటీలకు హాజరవుతూ నాలోని ప్రతిభను మెరుగు పరుచుకుంటుంటాను ఆంధ్ర జ్యోతి వారి పోటీ ద్వారా నాకు మొదటి సారి ప్రథమ బహుమతి దక్కినందుకు ఎంతో ఆనందంగా ఉంది.

చాలా సంతోషంగా ఉంది
చుంచు రాజ్యలక్ష్మి, ద్వితీయ బహుమతి విజేత

నేను టైలరింగ్ చేస్తుంటా. మాది పాల్వంచ నాకు ముగ్గులు వేయటం అంటే ఎంతో ఇష్టం పోటీలకు హాజరవటం ద్వారా కొత్త ముగ్గులను నేర్చుకునే ప్రయత్నం చేస్తా. ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలో పాల్గొనాలన్న పట్టుదలతో ఇక్కడకు వచ్చా. బహుమతి సాధించా.

మరింత పట్టుదలను పెంచింది.
కూరపాటి నిర్మల, తృతీయ బహుమతి విజేత

పోటీలో మూడవ బహుమతి రావటం ఆనందాన్నిచ్చింది. ఈస్ఫూర్తితో మరింత మంచి బహుమతి సాధించాలన్న పట్టుదలను పెంచింది. నేను టైలరింగ్ చేస్తుంటా. మావారు కమీషన్ ఏజెంట్ మాకు ఒక పాప, బాబు.


హాజరైన పట్టణ ప్రజలు

పొంగులేటి నివాసానికి షర్మిల

- కుమారుడి వివాహ శుభపత్రిక అందజేత


మంత్రి పొంగులేటికి శుభలేఖ అందిస్తున్న కాంగ్రెస్ నాయకురాలు వైఎస్ షర్మిల

ఖమ్మం సంక్షేమవిభాగం, జనవరి7: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హైదరాబాద్ నివాసానికి కాంగ్రెస్ నాయకురాలు వైఎస్ షర్మిల ఆదివారం వెళ్లారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి దంపతులను కలుసుకున్న షర్మిల తన కుమారుడి వివాహానికి రావాలని ఆహ్వానించి వివాహ పత్రికను అందజేశారు.

పుట్టినూరు రుణం తీర్చుకుంటా

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- స్వగ్రామం స్నానాల లక్ష్మీపురంలో జన నీరాజనం

వైరా, జనవరి 7: ఉపముఖ్యమంత్రి హోదాలో తొలిసారి వైరా మండలంలోని తమ స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి వచ్చిన మల్లు భట్టి విక్రమార్కకు గ్రామప్రజలు నీరాజనం పలికారు. భట్టి విక్రమార్క మధిర నుంచి స్నానాల లక్ష్మీపురానికి మూడుగంటలు ఆలస్యంగా వచ్చినప్పటికీ గ్రామస్థులంతా ఆయన కోసం ఎదురుచూసి ఘనస్వాగతం పలికారు. గ్రామంలోకి ప్రవేశించగానే మహిళలు భట్టి విక్రమార్కకు కుంకుమ దిద్ది హారతులిచ్చారు. అక్కడి నుంచి భట్టి విక్రమార్క, నందిని దంపతులు, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఓపెన్‌టాప్ జీపులో గ్రామస్థుల అపూర్వ స్వాగతం మధ్య మేళతాళాలు, బాణసంచా కాలుస్తూ పూలవర్షం మధ్య అక్కడి పుణ్యక్షేత్రమైన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ భట్టి విక్రమార్క, నందిని దంపతులకు దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో భట్టి దంపతులతోపాటు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోనే భట్టి విక్రమార్కను గ్రామస్థులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క గ్రామస్థులతో మాట్లాడుతూ తనకు జన్మనిచ్చి ఇంతటివాడిని చేసిన స్నానాల లక్ష్మీపురం రుణం తీర్చుకుంటానని తెలిపారు. భట్టి విక్రమార్కకు జ్ఞాపిక అందజేశారు. లక్ష్మీపురానికి చెందిన నాయకులు వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, ఉపసర్పంచ్ మల్లు రామకృష్ణ, నాయకులు నూతి వెంకటేశ్వరరావు, వెంకటాచారి, మొగునూరి సత్యనారాయణ, వెంకటనాగేశ్వరరావు, పొట్టపల్లి నాగేశ్వరరావు, మల్లు పట్టయ్య, హరినాథ్, ఆలయ ఛైర్మన్ చింతనిప్పు రాంబాబు భట్టిని సన్మానించిన వారిలో ఉన్నారు. ఆతర్వాత వైరా నది ఒడ్డునున్న తమ తల్లిదండ్రులు మల్లు అఖిలాండదాసు, మాణిక్యమ్మ, సోదరుడు మల్లు అనంతరాములు, ఇతర బంధువుల ఘాట్ల వద్ద భట్టి విక్రమార్క దంపతులు నివాళులర్పించారు. భట్టికి గ్రామస్థులే కాకుండా జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఖమ్మం ఆర్డీవో గణేష్, అదనపు డీసీపీ ప్రసాదరావు, వైరా, సత్తుపల్లి ఏసీపీలు ఎం.ఏ.రెహ్మాన్, రామానుజం, ఖమ్మం ఏడీఎఫ్ అంజనేయస్వామి, వైరా ఏడీఏ వి.బాబూరావు, తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు, ఎంపీడీవో డి.కరుణాకర్‌రెడ్డి సహా ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఇతర శాఖలు, పోలీసుశాఖ నుంచి వచ్చిన అధికారులు, సీఐలు, ఎస్‌ఐలు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు.


అభివాదం చేస్తున్న భట్టి విక్రమార్క దంపతులు


కాంగ్రెస్ జెండా ఆవిష్కరణలో భట్టి

అంతకముందు మధిర నుంచి వచ్చిన భట్టి విక్రమార్క వైరాలోని వ్యవసాయ మార్కెట్ వద్ద ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు రాయల నాగేశ్వరరావు, వైరా మునిసిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, దాసరి దానియేలు, పణితి సైదులు, మిట్టపల్లి నాగి, ధార్న రాజశేఖర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, వడ్డె నారాయణ, మచ్చా బుజ్జి, బీవీకే రత్నం స్వాగతం పలికారు. స్నానాల లక్ష్మీపురం వెళ్లే మార్గమధ్యలోని గండగలపాడులో కౌన్సిలర్ కర్నాటి నందిని, హన్మంతరావు తదితరుల ఆధ్వర్యంలో భట్టి విక్రమార్కకు స్వాగతం పలికారు. అక్కడ భట్టి విక్రమార్క అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు.


క్రీడల్లోనూ సత్తా చాటాలి

- సింగరేణి సీఎండీ బలరాంనాయక్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సింగరేణి సీఎండీ బలరాంనాయక్

కొత్తగూడెం, జనవరి7: సింగరేణికి చెందిన ఉద్యోగులు, కార్మికులు సంస్థ అభివృద్ధికి కృషి చేస్తూ క్రీడల్లోనూ ప్రతిభను చాటాలని సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాంనాయక్ కోరారు. ఆదివారం రుద్రంపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ మైదానంలో కంపెనీ లెవల్ క్రికెట్ లీగ్ ఫైనల్ పోటీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫైనల్ పోటీని ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఫ్రెండ్లీ పోటీలో ఛైర్మన్ లెవన్, డైరెక్టర్స్ లెవన్ జట్ల మధ్య జరిగింది. ఈ పోటీలో మొదట బ్యాటింగ్ డైరెక్టర్స్ లెవన్ జట్టు చేసి 10 ఓవర్లకు 57 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఛైర్మన్ లెవన్ జట్టు 58 పరుగులు చేసి గెలుపొందింది. తృతీయ స్థానం కోసం రామగుండం రీజియన్, కార్పొరేట్ మణుగూర్ ఏరియా జట్టులు తలపడగా మనుగూరు ఏరియా టీమ్ గెలుపొందింది. ఫైనల్ పోటీ బెల్లంపల్లి రీజియన్, కొత్తగూడెం అండ్ మణుగూరు ఏరియా టీమ్‌ల మధ్య జరుగగా మొదటి బ్యాటింగ్ చేసిన కొత్తగూడెం అండ్ మణుగూరు ఏరియా టీమ్ 20 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 163 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్‌కి దిగిన బెల్లంపల్లి రీజియన్ టీమ్ వికెట్ కోల్పోకుండా 8.4 ఓవర్లలో 63 పరుగులతో బ్యాటింగ్ చేస్తోంది.

విజయ డెయిరీ పాపాలు



- వెన్నశాతం తగ్గించి నిర్వాహకుల దోపిడీ
- ఆందోళనలో విజయ పాడిరైతులు

ఖమ్మం కార్పొరేషన్, జనవరి7: ప్రభుత్వ రంగసంస్థ విజయ డెయిరీలో పాడిరైతులు పోసే పాలలో వెన్నశాతం తగ్గించి, సొమ్ములు స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని పాడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆదివారం పాడిరైతులు నగరంలోని విజయ డెయిరీ డీడీ కార్యాలయం ఎదుట నిరసన తెలియచేశారు.

మిషన్లలో తేడాతో ఆందోళన

విజయ డెయిరీకి పాలు పోసినప్పుడు పాలలో వెన్నశాతాన్ని బట్టి ధరణు నిర్ణయించి, పాడిరైతుకు చెల్లిస్తుంటారు. అయితే మిషన్లలో తేడా రావటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మిల్క్‌టెస్ట్ అనలైజర్‌లో వెన్నశాతానికి, గర్బర్‌ప్యాట్‌కు(యాసిడ్‌తో చేసే పరీక్ష) తేడా రావటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. వాస్తవంగా గర్బర్‌ప్యాట్ పరీక్షలో వెన్నశాతం ఖచ్చితంగా వస్తుంది. అయితే ఈ పరీక్షలో స్వల్పంగా వెన్నశాతం తగ్గిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాడిరైతులు దోపిడీకి గురవుతున్నారు. అంతేకాకుండా తగ్గించిన వెన్నశాతానికి సరిపడా నీళ్లు కలిపి, సొమ్ములు స్వాహా చేస్తున్నారని పాడిరైతులు ఆరోపిస్తున్నారు.


విజయ డెయిరీ డీడీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పాడిరైతులు

స్వల్పంగా తగ్గిస్తూ..

ఒక ప్రణాళికప్రకాం వెన్నశాతాన్ని స్వల్పంగా తగ్గిస్తూ పాడిరైతులను దోచుకుంటున్నట్లు తెలుస్తోంది, ఇక లీటర్‌కు 0.5 పాయింట్లు తగ్గిస్తున్నట్లు పాడిరైతులు ఆరోపిస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్, మేనేజర్‌ల ఆధ్వర్యంలో మోసం జరుగుతన్నదనే ఆరోపణలు వస్తుండగా, ఆదివారం కొందరు పాడిరైతులు విజయ డెయిరీకి వెళ్లి పాలలో వెన్నశాతానికి పరీక్ష చేయించారు. ఒక మిషన్‌పై వచ్చిన వెన్నశాతానికి వేరే పరీక్షలో వచ్చిన వెన్నశాతానికి తేడా రావటంతో అక్కడి సిబ్బందిని నిలదీశారు.

రోజుకు 12వేల లీటర్ల పాలసేకరణ

విజయ డెయిరీ ద్వారా రోజుకు 12వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. అయితే 5 పాయింట్లు వెన్నశాతం తగ్గించి చూపెడితే రైతుకు ఇచ్చే బిల్లులో లీటర్‌కు 4రూపాయల తగ్గుతుంది. అలా 12వేల లీటర్లలో వెన్నశాతం తగ్గించి చూపితే రోజుకు రూ.48వేలు పాడిరైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఆ మేరకు పాలలో నీళ్లు కలిపి సొమ్ములు స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

విచారణ చేస్తాం: డెయిరీ డీడీ కుమారస్వామి

పాలలో వెన్నశాతం తగ్గిస్తున్నట్లు పాడిరైతుల ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తామని విజయ డెయిరీ డీడీ డాక్టర్. కుమారస్వామి పేర్కొన్నారు. అవినీతికి పాల్పడే ఉద్యోగుల పట్ల చర్యలు తీసుకుంటామన్నారు. పాడిరైతులు పోసే పాలలో వెన్నశాతంను రెండు, మూడుసార్లు పరీక్ష చేసి, ఖచ్చితంగా లెక్కగట్టి రైతులు నష్టపోకుండా బిల్లులు చెల్లిస్తామని డీడీ పేర్కొన్నారు.

ఏరియా జీఎంకు సీఐటీయూ విజ్ఞప్తి

మణుగూరుటౌన్, జనవరి 7: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ-2 గని కొత్త సైట్ ఆఫీస్ కార్యాలయానికి, పంచ్ఎంట్రీ(కేపీయుజీ)కి కార్మికులు విధులకు హాజరయ్యేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. ఓసీ-2 సైట్ ఆఫీస్, వర్క్‌షాపులను తరలించే కార్యక్రమాన్ని సీఐటీయు స్వాగతిస్తుందన్నారు. ఉత్పత్తి, ఉత్పాదకతలతోపాటు రవాణ ఖర్చులను ఆదాచేసేందుకు ఏరియా యాజమాన్యం చేస్తోన్న ఈ మార్పులపట్ల సీఐటీయు హర్షం వ్యక్తం చేసింది. ఈ విషయంలో యాజమాన్యం నూతన కార్యాలయాలకు, కేపీయుజి గనికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం, ప్రత్యేక రోడ్డును ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయు బ్రాంచి కార్యదర్శి వెంకరత్నం, లక్ష్మణరావు, రామ్మూర్తి, ఈశ్వరరావు, లక్ష్మణరావు, శ్రీకాంత్, భిక్షపతి, బుచ్చిరెడ్డి, నెల్సన్, రాజు, ప్రభాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే గ్యాస్ ఈకేవైసీ

పాల్వంచ టౌన్, జనవరి 7: వినియోగదారుల ఇంటి వద్దనే గ్యాస్ ఈకేవైసీ చేస్తామని పాల్వంచ హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. ఎలక్ట్రానిక్ పద్ధతిలో కనుపాపలు, ఆబ్లిక్ ఫేస్‌రీడింగ్, తంబ్‌ల ఆధారంతో ఈకేవైసీ చేస్తామన్నారు. మంచికంటినగర్, వెంగళరావుకాలనీ, బొల్లోరుగూడెం, హిల్స్‌కాలనీల్లో ఈకేవైసీను పరిశీలించారు.

ఆదివాసీలకు ఉలెన్ దుప్పట్ల పంపిణీ

దుమ్ముగూడెం, జనవరి 7: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాచలం ఆధ్వర్యంలో దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని అడవిరామవరం, చెన్నాపురం, ఉయ్యాలమడుగు, చెలమల, పూసుగుప్ప, క్రాంతిపురం ఆదివాసీ గ్రామాల్లో ఆదివారం ఉలెన్ దుప్పట్లను పంపిణీ చేశారు. సొసైటీ సభ్యులు డాక్టర్ ఎస్ఎల్.కాంతారావు, సూర్యనారాయణ, రాజారెడ్డి, కామేశ్వరావు, భానుప్రసాద్, సిద్ధులు, ఎంపీటీసీ రామారావు, సర్పంచులు కన్నారావు, గోపాలరావు, కవిత, చంటి, రమేష్, విజయ్, రవి, ఆది తదితరులు పాల్గొన్నారు.

మోసగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

దుమ్ముగూడెం, జనవరి 7: ఏజెన్సీ మండలాల ఆదివాసీలను పత్తి కాంటాల తూకంలో మోసగిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని ఏవీఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సోందె మల్లు ఆదివారం డిమాండ్ చేశారు. మోసానికి అలవాటుపడ్డ కొందరు వ్యాపారులు అమాయక ఆదివాసీ రైతుల నుంచి ధాన్యం, పత్తి, తదితర పంటలను గిట్టుబాటు ధర, తప్పుడు కాంటాలతో ఏళ్ల తరబడి మోసగిస్తున్నారని ఆరోపించారు. మండల అధికారులు అక్రమార్కులను గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని నాయకులు రామచంద్రయ్య, వీరాస్వామి, ఆదినారాయణమూర్తి తదితరులు డిమాండ్ చేశారు.

వైభవంగా గురు ఆరాధన మహోత్సవం

మణుగూరు, జనవరి 7: మణుగూరులోని గాయత్రీ జ్ఞానపీఠంలో ఆదివారం దయానిధి అక్కినేపల్లి వసంతా చార్యులు గురువు కార్మూరి వెంకటసుబ్బారెడ్డి 24వ వార్షికోత్సవ ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జ్ఞానపీఠాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సీపీఐ రాష్ట్ర నేత అయోధ్య, కాంట్రాక్టర్ పీవీ చారి, పిచ్చేశ్వరరావు దంపతులు హాజరయ్యారు. గోపూజా, జెండా ఆవిష్కరణ, గీతాపారాయణం, గాయత్రీ హోమం, గురుపూజ గురు ప్రవచనాలు అన్నసంతర్పణ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రదీప్ శాస్త్రీ, రామాడుగు నర్సింహాచార్యులు, సుబ్బారావు, రాజయోగి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాసవిక్లబ్ అధ్యక్షుడిగా దేవరాజ్ ప్రమాణ స్వీకారం

అశ్వారావుపేట, జనవరి 7: అశ్వారావుపేట వాసవిక్లబ్ అధ్యక్షుడిగా జల్లిపల్లి దేవరాజ్, కార్యదర్శిగా రావికింద రాజా, కోశాధికారిగా సత్యవరపు బాల గంగాధర్, కోశాధికారిగా శీమకుర్తి సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేసారు. ఆదివారం ఖమ్మంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ సంస్థాపన సభలో గవర్నర్ గుమ్మడి శ్రీనివాసరావు, మాజీ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఆగిరి వెంకటేష్ సమక్షంలో అశ్వారావుపేట వాసవి క్లబ్ కార్యవర్గ సమావేశం జరిగింది.

శాశ్వత మార్కెట్ సాధనకు ఆందోళన

జూలూరుపాడు, జనవరి7: జూలూరుపాడులో శాశ్వత మార్కెట్ ఏర్పాటుకై టీడీపీ, వామపక్ష పార్టీల, రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో దశల వారీగా పోరాటాలను నిర్వహిస్తామని నాయకులు తెలిపారు. ఆదివారం సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు అధ్యక్షతన జూలూరుపాడులోని ఓ పాఠశాలలో టీడీపీ, సీపీఐ, సీపీఎం, ప్రజాపంథా, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, రైతు సంఘాల సంయుక్త సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జూలూరుపాడులో ఉన్న ఉప మార్కెట్ యార్డును ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ నుంచి విడగొట్టి శాశ్వత మార్కెట్ నిర్మించాలని డిమాండ్ చేశారు. మార్కెట్ నిర్మాణం కోసం గత కొన్నేళ్ల క్రితం జూలూరుపాడులో 10 ఎకరాల భూమిని కేటాయించినప్పటికి నేటికి నిర్మాణాన్ని చేపట్టకపోవడంతో రైతులు, హమాలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో ఎన్నో సార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి జూలూరుపాడులో శాశ్వత మార్కెట్‌ను నిర్మించాలని కోరినప్పటికి పట్టించుకోలేదని అన్నారు. మార్కెట్ ఏర్పాటు చేయాలని గతంలో మండల పరిషత్, జిల్లా పరిషత్ సమావేశాలలో తీర్మాణాలు చేయించినప్పటికి ఫలితం లేదన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ చొరవ చూపి శాశ్వత మార్కెట్ ఏర్పాటుకై కృషి చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో ప్రజాపంథా మండల కార్యదర్శి బాణోత్ ధర్మా, సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్, న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వల్లోజి రమేష్, టీడీపీ జిల్లా కార్యదర్శి వడ్డె వెంకటనారాయణ, ఏదులాపురం గోపాలరావు, హమాలీ మేస్త్రీలు పప్పుల వీరస్వామి, బోడయ్య, గత్తం బాబూరావు, సుందర్‌రావు, రామస్వామి, శ్రీను, దేవదానం, తదితరులు పాల్గొన్నారు.

కాకర్లలో ఉచిత వైద్య శిబిరం

జూలూరుపాడు, జనవరి 7: మండలంలోని కాకర్ల గ్రామంలో కొత్తగూడెంకు చెందిన వీకేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ప్రజలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మహ్మద్ పాషా, శివతేజ, రాజేష్, విజయశ్రీ, వాణి, రాము, నిర్వాహకులు ఎస్‌డి రహీముద్దీన్, గుత్తా నవీన్ పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు తరలిన టీడీపీ శ్రేణులు

జూలూరుపాడు, జనవరి 7: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నిర్వహించిన సభలో పాల్గొనేందుకు ఆదివారం జూలూరుపాడు మండలానికి చెందిన టీడీపీ శ్రేణులు తరలి వెళ్లారు. మండలంలోని బేతాళపాడు, అన్నారుపాడు, జూలూరుపాడు, పాపకొల్లు తదితర గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు సభలో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చల్లమల్ల గోవింద్, కోటం రాజు, చావా వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, తిరుమలరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వో టు జీఎంకు ఇఫ్టూ వినతి

మణుగూరుటౌన్, జనవరి 7: మణుగూరు ఏరియాలో పనిచేస్తోన్న సింగరేణి ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు ఖాకీ యూనిఫాంలను ఇవ్వాలని ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఏరియా ఎస్వోటు జీఎం వీసం కృష్ణయ్యకు ఇఫ్టూ ఆధ్వర్యంలో సెక్యూరిటీ గార్డులు వినతిపత్రమందజేశారు. ఇఫ్టూ కాంట్రాక్ట్ కార్మికుల ఏరియా అధ్యక్షుడు మంగిలాల్ మాట్లాడారు. ఇఫ్టూ విజ్ఞప్తిమేరకు మణుగూరు మినహా సింగరేణి వ్యాప్తంగా సెక్యూరిటీ గార్డులు ఉచితంగా ఖాకీ యూనిఫాంలను అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా మణుగూరులోను ఖాకీ యూనిఫాంలను అందజేయాలని కోరారు. యూనిఫాంలు ఇచ్చే విషయంలో నూతన కాంట్రాక్టర్ కొన్ని అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, సింగరేణి వ్యాప్తంగా రాణి సమస్య ఇక్కడ ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. ఏరియా యాజమాన్యం ఈ విషయంలో జోక్యం చేసుకుని ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు ఖాకీ యూనిఫాం అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామ్‌అవతార్, సుధాకర్, ప్రభాకర్, భరత్, శ్రీను, వాసు, రబ్బాని, ప్రవీణ్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌కు భయపడుతున్న యాజమాన్యం

ఫ్రీ మస్టర్లు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు

ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి రాంగోపాల్

మణుగూరుటౌన్, జనవరి 7: సింగరేణి సంస్థలో ఇటీవల జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ ఓడిపోయినప్పటికిని ఏరియా యాజమాన్యం అధికారంలో ఉన్నట్లుగానే భావిస్తోందని ఏఐటీయుసీ బ్రాంచి కార్యదర్శి వై.రాంగోపాల్ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుర్తింపు కార్మిక సంఘంగా ఓడిపోయిన టీబీజీకేఎస్ నాయకులకు యాజమాన్యం భయపడుతోందని, ఇంకా టీబీజీకేఎస్ అధికారంలో ఉన్నట్లుగానే భావిస్తోందని ఆరోపించారు. ఆ సంఘం నాయకులకు ఏరియా ఫ్రీ మస్టర్లు ఇస్తూ యూనియన్ నాయకులను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. దీంతో ఇతర కార్మికులపై అధిక పనిభారం మోపుతూ వేదిస్తుంటే ఊరుకునేది లేదన్నారు. ఇప్పటికైన అధికారులు పద్ధతి మార్చుకోవాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

అస్తవ్యస్తంగా సైడ్ డ్రెయిన్ పనులు



ఆసుపత్రి సమీపంలో ప్రమాదభరితంగా కందకం



అర్థాంతరంగా ఆగిన కాలువ పనులు

మణుగూరు, జనవరి 7: మణుగూరు పట్టణంలోని ప్రధాన రహదారికి ఎడమ వైపు నిర్మిస్తున్న కాలువ నిర్మాణం అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో పట్టణ ప్రధాన రహదారి పక్కన నివాసముండే కాలనీల, పలు వాడల వాసులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం ఉన్న ప్రధాన రహదారి డివైడర్ల నుంచి 50 అడుగుల వెడల్పు మార్జిన్‌గా చేసుకుని నిర్మించే ఈ సీసీ డ్రైన్ల నిర్మాణాలపై ప్రజలనుంచి తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. పట్టణంలో ని వంద పడకల ఆసుపత్రి నుంచి అశోక్‌నగర్ వరకు నిర్మిస్తున్న ఈ సీసీ సైడ్ డ్రైన్ల నిర్మాణాల పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రోడ్డు వద్దకు ఆక్రమించిన కట్టడాలను తొలగించి కందకాలు తీస్తు కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. కాలువ పనుల్లో కింద కాంక్రీట్ బేస్‌వేస్తూ సీసీ సైడ్ వాల్స్ నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రధాన రహదారికి అనుసంధానంగా అశోక్‌నగర్ నుంచి సాయినగర్ వరకు అనేక వీధులు ఉండగా ఆయా ప్రాంతాల్లో కాలువపై సీసీ బిల్లలను వేయక పోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ఇప్పటికే దాదాపు రెండు నెలల నుంచి కాలువ పనుల వల్ల తాము పడే ఇబ్బందులు చెప్పలేనివిగా ఉన్నాయని అశోక్ నగర్, సాయి నగర్ వాసులు గగ్గోలు పెడుతున్నారు. ఇక వంద పడకల ఆసుపత్రి వద్ద ఉన్న బ్రిడ్జి ప్రాంతంలో కాలువ నిర్మాణాల కోసం తీసిన కందకం రోజు రోజుకు విస్తరణ పెరిగిపోతుంది. ఈ ప్రాంతంలో మట్టి ఊర్లిపోతుండటంతో ఈ ప్రాంతం ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కన నివాసాలు, పలు కార్యాలయాలు, బ్యాంకులు ఉండగా వాటిని చేరుకోవడం కోసం కర్రలను కాలువపై అడ్డం వేసుకుని కాలువలను ప్రమాదకర పరిస్థితుల్లో దాటాల్సి వస్తోంది. గత వారం నుంచి పనులు చేపట్టే కాంట్రాక్టర్ అకస్మాత్తుగా పనులు నిలిపివేయడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. రోడ్డు విస్తరణ పనులు కాలువ నిర్మాణాలు పట్టణ అభివృద్ధిలో భాగంమైనా పనులు చేసే కాంట్రాక్టర్లు తమను దాదాపు రెండు నెలలుగా ఇబ్బందులకు గురి చేయడం సరికాదని స్థానికులు వాపోతున్నారు. పనులు చేపట్టే కాంట్రాక్టర్ అర్థాంతరంగా పనులు నిలిపివేయడానికి గల కారణాలు ఏమిటో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై ఆర్అండ్‌బీ అధికారులను వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా వారు అందుబాటులో లేరు. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గాయత్రీ యజ్ఞంలో పాల్గొన్న పాయం



యజ్ఞంలో పాల్గొన్న పాయం

మణుగూరుటౌన్, జనవరి 7: మండలంలోని గుట్టమల్లారం గ్రామంలోని వసంతాచార్యులు నివాసంలో ఆదివారం ప్రత్యేకంగా నిర్వహించిన గాయత్రిదేవి యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖః సంతోషాలతో వర్ధిల్లాలని, రాష్ట్రంలోనే అభివృద్ధిలో పినపాక నియోజకవర్గం ముందుండాలని దేవి కోరినట్లు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు బేతంచర్ల వెంకటేశ్వర్లు, సాయిన్ని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు శుభాకార్యాల్లో పాల్గొన్నారు.

మజీదు ప్రారంభం

మణుగూరు మండల పరిధిలోని రామానుజవరం గ్రామంలో నూతన మజీదును ఆదివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని పేర్కొన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ముస్లింలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. నియోజకవర్గంలో ముస్లింలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మజీదు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశారు.. అయినా ఓడించారు: మెచ్చా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

దమ్మపేట, జనవరి 7: కేసీఆర్ సహకారంతో కోట్ల రూపాయలతో అశ్వారావుపేట నియోజక వర్గాన్ని అభివృద్ధి చేశానని, అయినా ఓటమి చెందానని మాజీ ఎమ్మెల్యే మెచ్చా అన్నారు. బీఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం తాటిసుబ్బన్నగూడెంలో మెచ్చా నివాసంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెచ్చా మాట్లాడుతు పది సంవత్సరాలలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో దేశంలో తెలంగాణాకు గుర్తింపు వచ్చే విధంగా కేసీఆర్ అభివృద్ధి చేసారని అన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధిపై ఏమి మాట్లాడాలో తెలియకు విమర్శలు చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడిపోవడం పట్ల ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని అన్నారు. గెలుపు ఓటములు సహజమని నిత్యం ప్రజలకు అందుబాటులో వుంటానని మెచ్చా తెలిపారు. అప్పుడే కాంగ్రెస్ పార్టీలో నాయకులు, కార్యకర్తలు దందాలు చేస్తున్నారని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, దారా యుగంధర్, మండల ప్రధాన కార్యదర్శి దొడ్డా రమేష్, పలువురు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ సహకరిస్తా

సంఘం అధ్యక్షుడి సన్మాన సభలో ఎమ్మెల్యే జారే



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట రూరల్, జనవరి 7: ఆర్యవైశ్య సంఘానికి ఎల్లప్పుడు తన సహకారం ఉంటుందని, నూతనంగా మండల అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసరావుకు సంపూర్ణ మద్దతును అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఊట్లపల్లిలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సుంకవల్లి వీరభద్రరావు ఆధ్వర్యంలో నూతనంగా ఆర్యవైశ్యసంఘ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన శీమకుర్తి శ్రీనివాసరావుకు ఏర్పాటు చేసిన అభినంధన సభలో ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనివాసరావు తాను ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కాలం నుంచి సుపరిచితులని, ఎన్నో కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారని అన్నారు. ఎంతో సౌమ్యుడిగా పేరున్న శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకోవటం శుభపరిణామన్నారు. అనంతరం అధ్యక్షుడు శ్రీనివాసరావును, పట్టణ అధ్యక్షులు జల్లిపల్లి లోక్‌నాథ్‌లను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, సుంకవల్లి వీరభద్రరావులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జూపలి రమేశ్, సత్యనారాయణ చౌదరి, ఆర్యవైశ్యసంఘ జిల్లా నాయకులు కొణిజర్ల ఉమా మహేశ్వరరావు, ఎంపీటీసీ వేముల భారతి, బండారి శ్రీనివాసరావు, మౌలాలి, తోకల సత్యనారాయణ, కక్కిరాల లక్ష్మినారాయణ, కక్కిరాల శ్రీనివాసరావు, సమయమంతుల మహేశ్వరరావు, జుజ్జూరు వెంకటనారాయణ, బత్తిన పార్థసారది, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి నాగబాబు, పలువురు ఆర్యవైశ్యసంఘ ప్రతినిధులు, విలేకర్లు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైశ్యులు ఐక్యంగా ముందుకెళ్లాలి

దమ్మపేట: ఆర్యవైశ్యులు ఐక్యంగా ముందుకు వెళ్లాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్యసంఘం సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో పలువురు మాట్లాడారు. అనంతరం కక్కిరాల రమేష్, అద్దంకి లక్ష్మినారాయణ, మాడా లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా నూతన కమిటిని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా దారా ప్రసాదు (డిపి), ప్రధాన కార్యదర్శిగా దారా వెంకటేశ్వరావును ఎన్నుకున్నారు. వీరితో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులు, 20మంది గౌరవ సలదారులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

విద్యార్థులను భావిపౌరులుగా తీర్చి దిద్దాలి

జూలూరుపాడు, జనవరి7: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి భావి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని విశ్రాంత ఎంఈవో మద్దిశెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం జూలూరుపాడులోని సాయిఎక్సలెంట్ పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయిలో విద్యార్థులకు నవోదయ టాలెంటెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశ్నా పత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవోదయ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ముందస్తుగా టాలెంటెస్ట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో 150 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతిని సాయి ఎక్సలెంట్ పాఠశాలకు చెందిన హర్షవర్ధన్, నందితా సాధించగా, తల్లాడ మండలానికి చెందిన ఇతీష్ ప్రశాంత్ ద్వితీయ బహుమతి, తృతీయ బహుమతిని కల్లూరుకు చెందిన సాయి తేజస్సు సాధించగా ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ కృష్ణ ప్రసాద్, హెచ్ఎం శారదదేవి, ఉపాధ్యాయ సిబ్బంది పుల్లారావు, అశోక్, హుస్సేన్, మోహన్, కృష్ణయ్య, శివకుమారి, అనిత, నబీనా తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం: కూనంనేని



కూనంనేనిని సన్మానిస్తున్న నాయకులు

పాల్వంచ, జనవరి 7: కొత్తగూడెం శాసనసభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా కూనంనేని సాంబశివరావుకు తెలంగాణ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్(హెచ్-142) ఆధ్వర్యంలో ఆదివారం ఏ కాలనీలోని యూనియన్ ప్రాంతీయ కార్యలయంలో సన్మానసభను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కూనంనేని సత్కరించి గజమాలను అలంకరించి సన్మాన పత్రాన్ని బహుకరించారు. అనంతరం రామారావు మాట్లాడారు. కూనంనేని మాట్లాడుతూ యూనియన్ సభ్యులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై ప్రభుత్వ పెద్దల దృష్టికి, జెన్కో యాజమాన్యం తో మాట్లాడి పరిష్కారించే విధంగా ప్రయత్నం చేస్తానని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసచారి, సత్యారాజ్‌స్టీఫెన్, వెంకటేశ్వర్లు, సయ్యద్, నాగభూషణం, శివరాం, అనిల్, కోటేశ్వరరావు, అనిల్‌కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మైనారిటీల సమస్యలను పరిష్కరిస్తా

పాల్వంచ టౌన్: క్రిస్టియన్ మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం మార్కెట్ ఏరియా బైరాక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సమాజంలో శాంతి స్థాపనకు క్రిస్టియన్ మైనారిటీలు కృషిచేయడం అభినందనీయమన్నారు. జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, నాయకులు అడుసుమల్లి సాయిబాబు, పూర్ణచందర్‌రావు, డిసుధాకర్, రాహుల్, చర్చి సభ్యులు, బ్రదర్ ఐజాక్, మోజేష్‌చారి, నాగేశ్వారావు, సుగుణాచారి, ప్రసాదరావు, స్వామిదాస్, జాకబ్ పాల్గొన్నారు.

సీఆర్‌టీల సమస్యల పరిష్కారానికి కృషి



ఆదినారాయణను సన్మానిస్తున్న సీఆర్‌టీలు

దమ్మపేట, జనవరి 7: ఐటీడీఏలో పనిచేసే సీఆర్‌టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గిరిజన శాఖ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌టీలు గండుగులపల్లిలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణను సత్కరించారు. ఈ సందర్భంగా సీఆర్‌టీలు తమను అర్థాంతరంగ విధులనుండి తొలగించిన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. 15 సంవత్సరాలుగా పనిచేస్తున్నామని, తమను తొలగించడం వల్ల ఉపాధిని కోల్పోయామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత శాఖాధికారులతో మాట్లాడి ఎందుకు తొలగించారో అధికారులను అడిగి తెలుసుకొని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



పాల్వంచలో కోలాటం ఆడుతున్న మహిళలు

పాల్వంచ టౌన్, జనవరి 7: అయోధ్యలోని రాముడిని పూజించిన అక్షింతలకు పట్టణంలోని పలు కాలనీల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాట భజనల మధ్య నిర్వాహకులు ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. ఆదర్శ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ నగర్‌నగర్ కాలనీలోని ప్రతీ ఇంటికి అక్షింతలనందజేశారు. పొందూరి నర్సింహారావు, కాపా రమేష్, రాజు, వెంకట్, ఎంపార్థసారధి, ఆనంద్, మహిళా భక్తులు పాల్గొన్నారు. గట్టాయి గూడెంలో భక్తాంజనేయ ఆలయపూజారి వేణు అయ్యగారి నేతృత్వంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ బాధ్యులు గడదేశి వెంకటేశ్వర్లు, మేదరమెట్ల పార్థసారధి నేతృత్వంలో నవభారత్‌కాలనీ, పాలకొయ్యతండా, పాతపాల్వంచ, సాయినగర్‌కాలనీ, కేటీపీఎస్ కాలనీ, టీచర్స్ కాలనీల్లో పంపిణీ చేశారు. వెంకటేశ్వర హిల్స్ కాలనీలో ఖిల్లా శ్రీను, వేణు, కామేష్, కృష్ణ, సాయిబాబు ఆధ్వర్యంలో పంపిణీ జరిగింది.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం ఆత్మారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం అయోధ్య అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జయజయ ధ్వానాల నడుమ పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. కంద్రపు సింగరయ్య రెడ్డి, దల్లి వేణు, కెల్లా శేఖర్, పిమోహన్‌రావు, కర్రి రవీంద్రకుమార్, బాలాజీ, హర్ష, శ్రీమన్నారాయణ, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మణుగూరులో..

మణుగూరు: మణుగూరులోని రామానుజారం, కొండాయిగూడెం, శ్రీకృష్ణాపురం గ్రామంలో ఆదివారం బీజేపీ రాష్ట్ర నాయకులు జంపన సీతారామరాజు ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన రామల వారి అక్షింతల శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో వీధుల్లో ఈ యాత్రను కొనసాగించారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్



డాక్టరేట్ ప్రదానం చేస్తున్న యూనివర్శిటీ ప్రతినిధులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి7: కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చింతా శారదకు ఉస్మానియా యునివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగ అధిపతిగా, ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న శారద ఉస్మానియా యునివర్సిటీలో పరిశోధన చేశారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొత్తగూడెం ఏరియాలో చట్ట పరంగా స్వచ్చంధంగా తీసుకుంటున్న 'భద్రత ప్రమాణాలు - ఒక పరిశీలన' అనే అంశంపై తన పరిశోధనను పూర్తి చేశారు. అనంతరం యునివర్సిటీ డీన్ ఆఫ్ కామర్స్ - హైదారాబాద్ ప్రొఫెసర్ గంగాధర్ పర్యవేక్షణలో పరిశోధనాత్మకత ప్రాజెక్ట్‌ను సమర్పించారు. ప్రిన్సిపాల్ శారదకు డాక్టరేట్ లభించడం పట్ల సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ జీఎం ఎస్.వెంకటేశ్వర్లు, కరెస్పాండెంట్ నికోలస్, అధ్యాపక సిబ్బంది ఆదివారం ఆమెను అభినందించారు.